# అగ్రకుల దురహంకారాన్ని హైకోర్టు మన్నించడం లజ్జాకరం

చుండూరు కేసు విచారిస్తున్న జడ్జి డా. ప్రభాకరరావు గారిని ముద్దాయిల కోరిక మేరకు ఒంగోలుకు బదలీ చేసిన సంగతి అందరికీ ఈ పాటికి తెలిసే ఉంటుంది.

ఆ బదిలీ ఎంతటి లజ్జాకరమైన పరిస్థితులలో జరిగిందో ప్రజలకు తెలియచెప్పడం అవసరం అని మేము భావిస్తున్నాము. బదలీ చేసింది హైకోర్టే అయినప్పటికీ మేము ఈ మాట అంటున్నాము.

ప్రభాకర్‌రావు గారు కులం రీత్యా దళితుడు. దళిత కులస్తుడయిన న్యాయమూర్తి కేసు విచారిస్తే, తమకు న్యాయం జరగదని అగ్ర కులస్తులైన చుండూరు కేసు ముద్దాయిలు భావించారు. దాదాపు అదే మాట ఆయనతోను అన్నారు. హై కోర్టుకూ చెప్పారు. బదిలీ అయి వెళ్ళిపోవడం తన మనశ్శాంతికి క్షేమకరం అని ఆయనకే అనిపించేటట్టు చేశారు. ఆయనను బదిలీ చేయకపోతే తమ తరపున కేసు నిర్వహించడానికి లాయర్లే దొరకరని బెదిరించారు. ఇప్పటికే కేసు చేస్తున్న లాయర్లంతా పక్కకు తప్పుకుంటారని ముద్దాయిలు బెదిరించడమే కాదు, వారి లాయర్లూ బెదిరించారు. తమ ప్రమేయం లేకుండ ఏకపక్షంగా కేసును నడుపుకుంటారో లేక జడ్జిని బదిలీ చేస్తారో నిర్ణయించుకోండని సవాలు విసిరారు.

ఇదంతా చేసి తమ కోరిక సాధించుకున్నారు. జడ్జిని హైకోర్టు బదిలీ చేసేసింది. అందుకే ఈ బదిలీని 'లజ్జాకరం' అంటున్నాం. చేసింది హైకోర్టే కావచ్చు అయినప్పటికీ అంటున్నాం.

చుండూరు మారణకాండ గురించి మేము ప్రజలకు కొత్తగా జ్ఞాపకం చేయవలసిన పని లేదు. 1991 ఆగష్టు 6వ తేదీన చుండూరుకు, పరిసర గ్రామాలకు చెందిన అగ్రకులస్తుల గుంపు ఆ వూరి దళిత వాడపైన పట్టపగలు దాడి చేసి ప్రజలను తరిమారు, కొట్టారు, నరికారు, చంపారు.

14సంవత్సరాలయినా కేసు విచారణ పూర్తికాక పోవడానికి హత్య చేసిన దుండగులే ప్రధాన కారణం. హతులు దళితులు కారనీ క్రైస్తవులనీ అందువల్ల ఎస్.సి., ఎస్.టి చట్టం వర్తించదని ఒకసారి కోర్టుకెక్కారు. ఆ కేసు ఓడిపోయిన తరువాత ఎస్.సి., ఎస్.టి. ప్రత్యేక కోర్టు చుండూరులోనే కూర్చుంటుందన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఒకసారి కాదు, రెండు సార్లు కోర్టుకెక్కారు. సాక్షులు, ముద్దాయిలు, పెద్ద సంఖ్యలో ఉంటే అందరు చుండూరుకు దాని పరిసర గ్రామాలకు చెందిన వారు అయినప్పటికి కేసు విచారణ చుండూరులోనే జరపడం చట్టరీత్యా తప్పుకాదు. సాధారణ న్యాయ దృష్టిలోను తప్పుకాదు. అయినప్పటికీ దానిపై వ్యాజ్యం నడిపారు.

ఆ వ్యాజ్యం ఓడిపోయిన తరువాత చుండూరు కేసు నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమించడాన్ని సవాలు చేస్తూ వాళ్ళే కోర్టు కెక్కారు.

ఎస్.సి., ఎస్.టి. అత్యాచారాల నిరోధక చట్టంలో, బాధితులను సంప్రదించి వారికి విశ్వాసం ఉన్న న్యాయవాదిని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించే అవకాశం ఉన్నప్పటికీ దళితులు కోరిన వ్యక్తిని ఎట్లా నియమిస్తారు ? అంటూ కోర్టు కెక్కారు. సింగిల్ జడ్జి వారి కేసును కొట్టేయగా డివిజన్ బెంచికి అప్పీలు కూడా చేసుకున్నారు.

అది కూడా వీగిపోయిన తరువాతే చుండూరు మారణకాండపైన విచారణ మొదలయింది. ప్రత్యక్ష సాక్షుల విచారణ దాదాపు పూర్తయిపోయిన దశలో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తిని బదిలీ చేయడం జరిగింది. ఇది ఏ ప్రత్యేక కారణం వల్ల జరిగిన బదిలీ కాదు. ఆనవాయితీగా న్యాయ వ్యవస్థలో జరిగే బదిలీలలో భాగంగా గుంటూరులో చాలా మంది బదిలీ అయ్యారు. ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కూడా బదిలీ అయి డా. ప్రభాకర్‌రావు గారు నియమితులయ్యారు.

క్రిమినల్ కేసును ఆద్యంతం ఒకే న్యాయమూర్తి విచారించాలన్న నియమమేది లేదు. కాబట్టి క్రొత్త న్యాయమూర్తి నియామకానికి ముద్దాయిలు అభ్యంతరం చెప్పే అవకాశం లేదు. అయినప్పటికీ చుండూరు ముద్దాయిలు వెంటనే హై కోర్టుకు నిరసన తెలుపుతూ ఉత్తరం రాశారు. పాత న్యాయమూర్తినే కొనసాగించమని కోరారు. ఆయనేమైనా వారికి అనుకూలంగా వ్యవహరించాడా అంటే లేదు. ఆయన తన వృత్తి ధర్మం ప్రకారం చేశాడు. మరి అటువంటప్పుడు బదిలీని నిలిపివేసి పాత న్యాయమూర్తినే కొనసాగించాలని ముద్దాయిలు ఎందుకు కోరారన్న ప్రశ్నకు ముద్దాయిల నుండి జవాబు లేదు.

వాళ్ళు జవాబు చెప్పుకున్న కారణం ఊహించడం కష్టం కాదు. కొత్త జడ్జి దళితుడని తెలిసి పాత జడ్జినే కొనసాగించాలని వారు హైకోర్టును కోరారు. కొత్త జడ్జి వ్యవహారశైలిని వారప్పటికి చూడలేదు. ఆయన న్యాయబుద్ధి కలవాడో కాదో నిర్ణయించడానికి వారి వద్ద అప్పటికి ఏ ఆధారాలు లేవు. అయినప్పటికీ పాత జడ్జినే కొనసాగించమని హైకోర్టును వారు కోరారంటే కొత్తాయన కులం రీత్యా దళితుడు కావడమొక్కటే దానికి కారణం కాగలదు.

అప్పుడే హైకోర్టు వారి అభ్యర్ధన పట్ల తగిన రీతిలో స్పందించవలసి ఉండింది. దళితులపైన దాడి చేసిన కేసులో అగ్రకులస్తులను విచారించడానికి దళితకులస్తుడయిన వ్యక్తి ఎంతటి న్యాయకోవిదుడయినా, నిష్పాతుడయినా అనర్హుడనే కదా వారు చెప్పదలచుకున్నది ? అది కోర్టు ధిక్కారం కాదా ? న్యాయ వ్యవస్థ అన్యాయమైన తీర్పు ఇచ్చిందని విమర్శించిన వారిని సహితం కోర్టు ధిక్కారానికి శిక్షిస్తారే, ఏ తీర్పు ఇంకా ఇవ్వక ముందే ఈ న్యాయమూర్తి దళితుడు కాబట్టి మాకు న్యాయం జరగదని భావిస్తున్నామని ప్రకటించేవారిని ఉపేక్షించడం భావ్యమా ?

అప్పుడు హై కోర్టు వారిని అభిశంసించలేదు గాని వారి కోరికను మన్నించనూ లేదు. ఊరకుండిపోయింది. కొత్త జడ్జి డా. ప్రభాకర్‌రావు గారి ఆధ్వర్యంలో చుండూరు కేసు విచారణ కొనసాగింది. 22 మంది సాక్షులను విచారించారు. వీరిలో ఎక్కువ భాగం పంచానామా మధ్యవర్తులు, పోలీసులు, డాక్టర్లు మొదలైన 'అధికారిక' సాక్షులు. వీరి సాక్ష్యానికి ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలానికి ఉండే ప్రాముఖ్యం ఉండదు. అయినప్పటికీ ఈ సాక్ష్యాలు నమోదు చేయడంలో న్యాయమూర్తి పక్షపాత బుద్ధి తో వ్యవహరిస్తున్నారని ముద్దాయిలు ఆరోపించ సాగారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, న్యాయమూర్తి కుమ్మక్కయి ప్రాసిక్యూషన్ కథనానికి అనుకూలించే పద్ధతిలో సాక్ష్యం నమోదు చేస్తున్నారనీ అందుకోసం సాక్షులపైన ఒత్తిడి పెట్టి వారిచేత అనుకూలంగా చెప్పిస్తున్నారని నింద వేశారు. ఈ నిందా పత్రాన్ని ఆగష్టు నెలలో న్యాయమూర్తి చేతికే ఇచ్చి **"ఈ కేసు మీరు విచారించిన యెడల ఏవిధంగాను న్యాయపరమైన తీర్పు వస్తుందని నమ్మకం లేదు. కనుక అన్యదా భావించక, మీ అధికారము మాపై చూపక వేరే జడ్జిగారి ద్వారా విచారణ జరిపించగలందులకు తగు చర్యలు తీసుకొనవలసిందిగా ప్రార్థించుచున్నాము"** అని కోరారు.

ఈ వాక్యాలలోని వెక్కిరింత ధ్వని సాధారణంగా కోర్టులో ముద్దాయిల నోట వినిపించేది కాదు. న్యాయమూర్తి దళితుడనే చులకన భావమే లేకపోతే ఇది సాధ్యమయ్యేది కాదు.

ఈ నిందా పత్రాన్ని ముద్దాయిలు న్యాయమూర్తికి ఇవ్వడమే కాక హైకోర్టుకూ కూడా పంపారు. చుండూరు కేసును ఆ కోర్టునుండి పొరుగు జిల్లాకు బదిలీ చేయమని హైకోర్టులో కేసు వేశారు. న్యాయమూర్తినే బదిలీ చేయమన్న అర్జీ కూడా పెట్టుకున్నారు. కేసును బదిలీ చేయడం హైకోర్టు న్యాయపరమైన అధికారం పరిధిలోని విషయం కాబట్టి కేసు వేసారు. జడ్జిని బదిలీ చేయడం హైకోర్టు పాలనాధికారం పరిదిలోని విషయం కాబట్టి అర్జీ పెట్టుకున్నారు. రెండూ ఒకేసారి చేశారు. రెండింటి కి ఆధారము ఆగష్టు నెలలో న్యాయమూర్తికే సమర్పించిన నిందా పత్రమే. దాని ముగింపు వాక్యాలను పైన ఉటంకించాము. అందులోని 15వ పేరాను కూడా ఉటంకించాలి.

**"మీరు ఎస్.సి. కులమునకు చెందిన వారని తెలియుచున్నది.ఔనో / కాదో మాకు తెలియదు. కానీ, జరిగిన పై విషయములు మరియు ఇతర విషయముల దృష్ట్యా, మమ్ములను ఇబ్బంది పెట్టుట గురించి సాక్ష్యములు సరిగా నమోదు చేయకపోవడాన్ని బట్టి, జరుగుతున్న అన్యాయాన్ని బట్టి, నిజమేనేమో అనిపిస్తుంది. అందువలన కూడా మాకు ఈ కేసులో న్యాయము జరగదని విశ్వసించుచున్నాము. కులప్రాతిపదికగా ఏర్పడిన న్యాయస్థానము కనుక అనుమానించుచున్నాము".**

అంటే న్యాయమూర్తి కులాన్ని బట్టి ఆయన నిష్పాక్షికతను శంకించవచ్చునా? న్యాయమూర్తి దళిత కులస్తుడయితే ఎస్.సి. ఎస్.టి. చట్టం క్రింద విచారణ ఎదుర్కొంటున్న అగ్రకుల ముద్దాయిలు తమకు న్యాయం జరగదని అనుమానించవచ్చు. ఎస్.సి. ఎస్.టి. స్పెషల్ కోర్టు 'కులప్రాతిపదికన' ఏర్పడిన న్యాయస్థానం కాబట్టి ఆ కోర్టులో విచారణ జరిపే న్యాయమూర్తి ఎస్.సి. గానీ ఎస్.టి. గాని అయితే ముద్దాయిలకు న్యాయం జరగదన్న విశ్వాస రాహిత్యాన్ని ప్రకటించి జడ్జి బదిలీగాని కేసు బదిలీ గానీ కోరవచ్చు.

ఇది చుండూరు ముద్దాయిల వాదన. దీనిని వారు తమలో తాము చెప్పుకొని ఊరుకోలేదు. కాగితం మీద పెట్టి హైకోర్టుకే ఇచ్చి కేసును గానీ జడ్జిని గానీ బదిలీ చేయమని అడిగారు.

న్యాయవ్యవస్థను అవమానపరిచినందుకు కోర్టు ధిక్కారం కేసు, దళితుడు అగ్రకులాల నేరాన్ని విచారించడానికి అనర్హుడని అన్నందుకు పిసిఆర్ చట్టం క్రింద కేసు వారి పైన నమోదు చేయవలసింది పోయి హైకోర్టు వారి అభ్యర్థన మేరకు జడ్జిని బదిలీ చేసింది. కేసు బదిలీ కోసం ముద్దాయిలు వేసిన వ్యాజ్యం ఇంకా విచారణలో ఉండగానే జడ్జినే బదిలీ చేసింది. ముద్దాయిల నిందా పత్రానికి డా. ప్రభాకర్‌రావు సంతృప్తికరంగా జవాబు చెప్పకపోలేదు. జవాబు చెప్పడమే కాక, ముద్దాయిలు కోర్టులో అనుచితంగా ప్రవర్తిస్తున్న వైనాన్ని కూడా హైకోర్టుకు వివరించాడు. ఈ తలనొప్పి తనకొద్దని తానే బదిలీ కూడా కోరాడు. ఆయన అభ్యర్థనకు అగ్రకుల ముద్దాయిలు పెట్టిన వేధింపులే కారణం అని హైకోర్టు గుర్తించి ముద్దాయిల పైన తగు చర్య తీసుకోవలసింది పోయి వారి కోరికే తీర్చింది.

**ఇది హైకోర్టుకు తగునా ? అని మేము అడుగుతున్నాం. దళితులను హతమార్చిన అగ్రకులస్తులు తమ కులాలకు చెందిన వారే తమను విచారించాలని డిమాండ్ చేయడాన్ని సమర్థించినట్టు కాదా ? న్యాయమూర్తిని ముద్దాయిలు అవమానపరచి, విసిగించి బదిలీకి సమ్మతించేటట్టు చేయడాన్ని ఆమోదించినట్టు కాదా ? రేపు దళిత బాధితులు జడ్జి దళితేతరుడు కాబట్టి మాకు న్యాయం జరగదని అనుమానిస్తున్నాం అంటే జడ్జిని మళ్ళీ బదిలీ చేస్తారా ?**

1991 ఆగష్టు 6న ముద్దాయిలు ఏ అహంకారాన్ని ప్రదర్శించారో అదే అహంకారాన్ని 2005 ఆగష్టునెలలో జడ్జి మీద తయారుచేసిన నిందా పత్రంలో మళ్ళీ ప్రదర్శించారు. మొదటి దానికి విచారణ ఇప్పటికీ పూర్తికాలేదు. రెండవది వారు కోరిన ఫలితాన్నే ఇచ్చింది. అందరికీ సమ న్యాయం జరుగుతుందన్న విశ్వాసాన్ని న్యాయవ్యవస్థ ప్రజలలో నిలబెట్ట దలచుకుందా లేదా?

**మానవ హక్కుల వేదిక (HRF)**
గుంటూరు జిల్లా కమిటీ

27, అక్టోబరు, 2005